సాక్షి
అనకాపల్లి
సోమవారం ౹ 1 ౹ సెప్టెంబర్ ౹ 2025

అల్లూరి విగ్రహ ఏర్పాటుకు వినతి



డాబాగార్డెన్స్: అల్లూరి విగ్రహాన్ని పార్లమెంట్‌లో ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను పలువురు కోరారు.



అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: సింహాద్రి అప్పన్నకు ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వర్ణపుష్పార్చన, నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు.



రాధాష్టమి ఉత్సవం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరంలోని హరేకృష్ణ వైకుంఠంలో రాధాష్టమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

సుజలాం.. విఫలాం..

సాగుకు 'చంద్ర' గ్రహణం.. రైతన్నకు కష్టకాలం.. వ్యవసాయం దండగని భావించే పాలకుల ఏలుబడిలో అన్నదాతకు అడుగడుగునా అన్యాయం.. సీఎం చంద్రబాబు నాయుడి పాలనలో గతంలో ఎదురైన చేదు అనుభవాలను రైతులు మళ్లీ గుర్తు చేసుకుంటున్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం స్థాపించి, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇవ్వడంతో సాగు హాయిగా సాగిపోయేది. అప్పుడు తలపెట్టిన సాగునీటి ప్రాజెక్టుల పనులను ప్రస్తుత కూటమి సర్కారు మధ్యలోనే వదిలేయడంతో అన్నదాతలు డీలా పడిపోతున్నారు.

జల నిధులున్నా.. సాగుకు అందని ద్రాక్షే!

- కూటమి ప్రభుత్వంలో నీటిపారుదల ప్రాజెక్టులపై నిర్లక్ష్యం
- నిధులు సిద్ధంగా ఉన్నా నిలిచిపోయిన ఆధునికీకరణ పనులు
- 'పెద్దేరు' పనులకు రూ.84.45 కోట్లు మంజూరు చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్
- 'తాండవ' నిర్వహణ పనులకూ అదే దుస్థితి
- కదలిక లేని 'రైవాడ' ప్రాజెక్టు పనులు



ఆధునికీకరణ లేకపోవడంతో పిచ్చితుప్పలతో పెద్దేరు జలాశయం ఆర్ఎంసీ పంట కాలువ



రావిపాలెం వద్ద పిచ్చి తుప్పలతో అధ్వానంగా పెద్దేరు ప్రాజెక్టు ప్రధాన పంట కాలువ రాచకట్టు అక్విడెక్టు

మాడుగుల: జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టుల నిర్వహణకు, ఆధునికీకరణకు నిధులు కేటాయించడంతో గత ప్రభుత్వ హయాంలో చకచకా పనులు ప్రారంభమయ్యాయి. అందులో కొన్ని పూర్తి కాగా మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. ఇప్పుడవి ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. జిల్లాలో వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. చెరుకు, వరి ప్రధాన పంటలు. చంద్రబాబు సర్కారు వచ్చాక గోవాడ చెరకు కర్మాగారం పరిస్థితి సైతం దయనీయంగా మారడంతో ప్రస్తుతం వరి మాత్రమే ప్రధాన పంటగా మిగిలిపోయింది. జిల్లాలో జలాశయాలున్నాయి కానీ వాటి నిర్వహణ, ఆధునికీకరణకు ప్రస్తుతం ప్రాధాన్యం దక్కడం లేదు. ఖరీఫ్ సీజన్‌లో 91 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. జలాశయాల అభివృద్ధి పనులు జరిగితే మరో 40 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు చెబుతున్నారు. ఆ దిశగా అధికారులు దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు శాపం

- పెద్దేరు జలాశయం ఆధునికీకరణ పనులకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.84.40 కోట్లు మంజూరు చేశారు. అదే జలాశయం ఫోర్ ఎల్ చానల్ కాలువ పరిధిలో ఏడు గిరి గ్రామాల్లోని 1800 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించేందుకు రూ.9.12 కోట్లు కేటాయించారు. నిధులు సిద్ధంగా ఉన్నా కూటమి సర్కారు వచ్చాక ఈ పనులు నిలిచిపోయాయి. ఆధునికీకరణలో భాగంగా పంట కాలువలకు సీసీ లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ఇవి పూర్తయితే చివరి ఆయకట్టు వరకు నిరందుతుంది.
- జిల్లాలో భారీ నీటిపారుదల ప్రాజెక్టు తాండవ జలాశయం 32 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. గత ప్రభుత్వంలో ఈ జలాశయం నిర్వహణ పనులకు రూ.2.65 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులు ఇంతవరకు మొదలు కాలేదు.
- రైవాడ జలాశయం పటిష్టత కోసం చేపట్టే పనులకు గతంలో రూ..256 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. నేటికీ కదలిక లేదు.
- మాడుగుల మండలంలో చిన్న సాగునీటి ప్రాజెక్టులు పాలగెడ్డ, ఉరకగెడ్డ, గొరిగెడ్డల ఆధునికీకరణకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఈ పనులు జరిగితే అదనపు ఆయకట్టు భూములకు సాగు నీరు అందుతుంది.

వ్యవసాయమే ప్రధాన ఆధారం




మాడుగుల నియోజకవర్గంలో ఎటువంటి కంపెనీలు లేవు. దీంతో ఇక్కడ ప్రజలకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి ఎకరాన్నీ సస్యశ్యామలం చేయడానికి సాగునీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రస్తుతం ఆ పనులు కొనసాగలేదు. జిల్లాలో ఉన్న జలవనరులను సద్వినియోగం చేసుకుంటే రెండు పంటలు పండి జిల్లాలో రెండు లక్షల ఎకరాలు పచ్చగా కళకళలాడుతాయి.

– పొలిమేర చిన్నారావు, సత్యవరం

ఖరీఫ్ పంట పూర్తయితే పనులు చేపడతాం

పెద్దేరు జలాశయం అభివృద్ధికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరు కావడం వాస్తవమే. ఆ పనులను ఖరీఫ్ పంట కాలం తర్వాత చేపడతాము. రైవాడ జలాశయం ఆధునికీకరణతోపాటు ఇతర పనులకు రూ.336 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాము. నిధులు మంజూరైతే పనులు చేపడతాము.

– ఎ.త్రినాథం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చోడవరం డివిజన్



రైవాడ జలాశయం



తారకరామ జలాశయం

పోస్టులు సరే.. అధికారులెక్కడ?

- గందరగోళంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ వ్యవహారం
- ఉన్నతాధికారుల్ని నియమించినట్లు రైల్వే బోర్డు ఉత్తర్వులు
- జీఎం తప్ప.. విశాఖలో కనిపించని ఇతర అధికారులు
- ఎవరికీ కార్యాలయాలు లేక బాధ్యతల స్వీకరణకు నో.!



సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు చేయనున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రకటన వచ్చి ఆరేళ్లు దాటినా, దాని కార్యకలాపాలు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. కాగితాలపై చకచకా పనులు జరుగుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం 'ఒక అడుగు ముందుకు, మూడు అడుగులు వెనక్కి' అన్న చందంగా పరిస్థితి మారిపోయింది. రైల్వే బోర్డు దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్‌గా (జీఎం) సందీప్ మాథుర్‌ని రెండున్నర నెలల క్రితం నియమించింది. అదేవిధంగా, పలువురు ప్రిన్సిపల్ అధికారుల్ని కూడా నియమించారు. అయితే జోన్‌కు ఇంకా శాశ్వత కార్యాలయం లేకపోవడంతో జీఎం విశాఖకు అప్పుడప్పుడు వస్తూ పోతున్నారు. మిగతా అధికారులు మాత్రం బాధ్యతలు స్వీకరించడానికి వెనుకంజ వేస్తున్నారు. వీఎంఆర్‌డీఏ ది డెక్, ఇతర రైల్వే భవనాలను తాత్కాలిక కార్యాలయాల కోసం రైల్వే బోర్డుకు పంపినా, ఇంతవరకు ఆమోదం లభించలేదు. దీంతో జీఎం విశాఖ రైల్వే గెస్ట్ హౌస్‌లోనే కాలం వెళ్లదీస్తున్నారు.

ప్రిన్సిపల్ అధికారులను నియమించినా..?

జీఎం నియామకం తర్వాత పలు ప్రిన్సిపల్ పోస్టులను కూడా జోన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇండియన్ రైల్వేస్ మేనేజ్‌మెంట్ సర్వీస్ (ఐఆర్ఎంఎస్) నుంచి ఒక ఎలక్ట్రికల్ అధికారిని, సౌత్ వెస్టర్న్ రైల్వే జోన్ నుంచి పీసీఎంఈ (ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్)గా అమిత్ గుప్తాని నియమించారు. కానీ వీరు ఇంకా బాధ్యతలు చేపట్టలేదు. ఎక్కడ బాధ్యతలు తీసుకోవాలో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది.

గెజిట్ విడుదల కీలకం

ఈ దుస్థితికి ప్రధాన కారణం గెజిట్ విడుదల కాకపోవడమేనని వాల్తేరు అధికారులు అంటున్నారు. గెజిట్ విడుదలైన తర్వాతే తాత్కాలిక కార్యకలాపాలు ప్రారంభం కావడం సాధ్యమవుతుంది. గెజిట్‌తో పాటుగా కార్యచరణ ప్రకటిస్తే, జీఎంతో సహా మొత్తం 180 మంది అధికారులు, ఉద్యోగులు నియమితులవుతారు. అప్పుడు మాత్రమే జోన్ కార్యకలాపాలు మొదలవుతాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే, దసరా నాటికి కూడా ఈ పనులు పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదు.

కేంద్రంపై ఒత్తిడి తేవాలి..

ప్రయాణికులు, ఉత్తరాంధ్ర ప్రజలు కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి వీలైనంత త్వరగా గెజిట్ విడుదల చేయించాలని, తద్వారా విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కావాలని కోరుకుంటున్నారు.

టీడీపీ కార్యకర్తల దౌర్జన్యం

- ఒమ్మలిలో మరుగుదొడ్డి నిర్మిస్తుండగా అభ్యంతరం
- తమ స్థలంలో ఎందుకు కడుతున్నారని కర్రలతో దాడి
- బాధితులు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు



తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు

మాడుగుల రూరల్: మండలంలోని ఒమ్మలి గ్రామంలో ఒక వ్యక్తి తన ఇంటి వద్ద బాత్రూమ్ కోసం పనులు చేయిస్తుండగా, అదే గ్రామానికి చెందిన ఐదుగురు మూకుమ్మడిగా దాడి చేసి, గాయపరిచారు. బాధితులు స్థానిక పోలీసు స్టేషన్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. బాధితులు, స్థానిక ఎస్ఐ కథనం ప్రకారం.. ఒమ్మలి గ్రామంలో తన ఇంటిని అనుకొని ఉన్న సొంత స్థలంలో ఆదివారం ఉదయం మరుగుదొడ్డి నిర్మాణం కోసం మార్కింగ్ చేసి, శ్రీనివాసరావు మరో నలుగురు వ్యక్తులు పనులు చేస్తుండగా వివాదం చెలరేగింది. తమ స్థలంలో బాత్రూమ్ ఎందుకు నిర్మిస్తున్నారని అదే గ్రామంలో దేశం పార్టీకి చెందిన కర్రి వెంకటరమణ, కర్రి చినబాబు, కర్రి రామునాయుడు, అక్కిరెడ్డి సత్యమ్మ, కర్రి ఈశ్వరమ్మలు మూకుమ్మడిగా శ్రీనివాసరావు మీద దాడి చేసి, కర్రలతో గాయపర్చారు. అడ్డుగా వచ్చిన శ్రీనివాసరావు భార్య లక్ష్మీబాయి జుత్తు పట్టుకొని ఈడ్చుకొని పోయారని, కర్రలతో తల మీద కొట్టి గాయపరిచి పరారయ్యారని స్థానిక పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. తల మీద కొట్టడం వల్ల నోరు, ముక్కు వెంబడి రక్తం కారిపోయింది. దీంతోపాటు శరీరం మీద గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనివాసరావును కుటుంబ సభ్యుల సహకారంతో మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లినట్టు స్థానిక ఎస్ఐ జి.నారాయణరావు తెలిపారు. బాధితులు శ్రీనివాసరావు, ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా శ్రీనివాసరావు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ బొడ్డాపు భాస్కరరావు సోదరుడు.

కౌన్సిల్‌కి ఇచ్చిన గౌరవం ఇదేనా..?

- మేయర్ తీరుపై మండిపడుతున్న కార్పొరేటర్లు
- కౌన్సిల్ జరిగి పది రోజులైనా మేయర్ సంతకానికి నోచుకోని ఆమోదం పొందిన అంశాలు

అల్లిపురం: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ముగిసి పది రోజులు గడుస్తున్నా, అందులో తీసుకున్న నిర్ణయాలపై మేయర్ ఇప్పటికీ సంతకం చేయకపోవడంపై కార్పొరేటర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదేనా కౌన్సిల్‌కు ఇచ్చే గౌరవం అని ప్రశ్నిస్తూ, ఇలా అయితే నగరాభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ఆందోళన చెందుతున్నారు. నగర మేయర్‌గా పీలా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టి మూడు నెలలు పూర్తయ్యాయి. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో 135 అంశాలతో కూడిన ఎజెండాను ప్రవేశపెట్టగా, ఒక అంశం మినహా మిగిలిన 134 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వీటిలో వార్డుల్లో అభివృద్ధి పనులు, పలు టెండర్లకు సంబంధించినవి కూడా ఉన్నాయి. కౌన్సిల్ ఆమోదం పొందిన అంశాలపై మేయర్ సంతకం చేయాల్సి ఉండగా, ఆయన ఇప్పటివరకు సంతకం చేయకపోవడంతో కార్పొరేటర్లు ఆగ్రహంగా ఉన్నారు. జీవీఎంసీ పాలకవర్గానికి మరో ఆరు నెలల గడువు మాత్రమే మిగిలి ఉంది. ఈలోగా మరో కౌన్సిల్ సమావేశం జరిగే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో పనులు వేగవంతం చేయడానికి టెండర్లు పిలిచి, పనులు మొదలుపెట్టాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్లు అంటున్నారు. కానీ మేయర్ నిర్ణయం తీసుకోకపోవడంపై వారు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

మరణానంతరం కళ్లు, దేహం దానం చేసిన వృద్ధురాలు



గాయత్రీ మెడికల్ కాలేజీకి సూర్యాకాంతం పార్థివ దేహాన్ని అప్పగిస్తున్న ఆమె కుమారుడు

పీఎం పాలెం: తాను మరణించిన తర్వాత పార్థివ దేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించాలన్న తల్లి చివరి కోరికను ఒక కొడుకు నెరవేర్చాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పీఎం పాలెంకు చెందిన 88 ఏళ్ల వద్దే సూర్యాకాంతమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తాను మరణించిన తర్వాత తన నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌కు, శరీరాన్ని గాయత్రీ మెడికల్ కాలేజీకి అప్పగించాలని ఆమె తన కుమారుడు నాగేంద్రబాబును కోరారు. ఆదివారం ఆమె మరణించగా, నాగేంద్రబాబు తన తల్లి కోరిక మేరకు సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ ట్రస్టీ సురేఖ ఆధ్వర్యంలో ఆమె పార్థివ దేహాన్ని ఆస్పత్రికి అప్పగించారు.

వైద్యశాఖలో పోస్టుల భర్తీ ఎప్పుడు?

- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- 8 నెలల క్రితం నర్సుల నియామకానికి నోటిఫికేషన్
- ఇప్పటి వరకూ పోస్టులు భర్తీ చేయని వైనం
- ఆందోళన చెందుతున్న నిరుద్యోగులు



మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలోనూ, కేజీహెచ్, ఆంధ్ర వైద్య కళాశాల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీలో కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తోంది. జనవరిలో విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం నర్సుల భర్తీ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. దీంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. తక్షణం పోస్టులు భర్తీ చేసి తమను ఆదుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను (సోమవారం మంత్రి విశాఖ వస్తున్నారు) కోరుతున్నారు.

అధికారంలోకి వస్తే లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు మాట తప్పారని నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఇది పారదర్శక పాలన కాదని వారు నిలదీస్తున్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతను ఆకట్టుకున్న కూటమి నేతలు, అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నా పోస్టుల భర్తీపై ఎలాంటి శ్రద్ధ చూపడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నోటిఫికేషన్ ఇచ్చి నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఖాళీలు

ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఖాళీగా ఉన్న 106 పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత వివిధ మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అదనంగా మరో 264 నర్సుల పోస్టులు చేరాయి. వీటితో కలిపి మొత్తం 370 పోస్టుల భర్తీకి వైద్య ఆరోగ్య ప్రాంతీయ డైరెక్టర్ కార్యాలయం చర్యలు చేపట్టింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో మొత్తం 8,300 దరఖాస్తులు వచ్చాయి. కొత్తగా వచ్చిన మెడికల్ కాలేజీలు, కేజీహెచ్, రాణీ చంద్రమతి దేవి ఆస్పత్రి, శ్రీకాకుళం, విజయనగరం, పాడేరు ప్రభుత్వ ఆస్పత్రులు, క్యాన్సర్ వార్డులకు అదనంగా నర్సులు మంజూరు కావడంతో పాటు, పదవీ విరమణ వల్ల ఏర్పడిన ఖాళీలతో కలిపి ఈ 370 పోస్టుల భర్తీకి ప్రక్రియ మొదలు పెట్టారు. అయితే డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి వచ్చిన ఆదేశాలతో 246 పోస్టుల భర్తీని నిలిపివేశారు.

టీచింగ్ ఆస్పత్రుల్లోనూ అదే పరిస్థితి

ఆంధ్ర మెడికల్ కాలేజీ, కేజీహెచ్, కాలేజ్ ఆఫ్ నర్సింగ్స్‌లో మొత్తం 22 కేటగిరీల్లో 71 పోస్టుల భర్తీకి అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానించారు. వీటికి భారీగా దరఖాస్తులు వచ్చినా, ఇంతవరకు ఏ ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదు. నిరుద్యోగులు ప్రతిరోజూ ఆశగా ఎదురుచూస్తున్నారు.

నర్సుల పోస్టుల భర్తీలో జాప్యం

124 నర్సుల పోస్టుల ఎంపిక జాబితాను విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, ఈ పోస్టులను వైద్య విధాన పరిషత్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆస్పత్రుల్లో భర్తీ చేస్తున్నామని తెలిపారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవు. వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉండే కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఇతర ఆస్పత్రుల్లో 90 పోస్టులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 34 పోస్టుల భర్తీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది.

కేజీహెచ్‌కు అత్యాధునిక పరికరాలు



లినాక్ పరికరం



సిటీ సిములేటర్

మహారాణిపేట: కేజీహెచ్ రేడియోథెరపీ విభాగంలో అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన ఈ పరికరాలను సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నారు. ఈ పరికరాల కోసం మొత్తం రూ. 45 కోట్లు ఖర్చు చేశారు. వీటిలో హెచ్‌డీఆర్ బ్రాచీ థెరపీ (రూ. 8 కోట్లు), లినాక్ (రూ. 22 కోట్లు), సీటీ సిములేటర్ (రూ. 10 కోట్లు) ఉన్నాయి. కేజీహెచ్‌లో 1983 నుంచి రేడియోథెరపీ విభాగం పనిచేస్తున్నప్పటికీ, ఇప్పుడు వచ్చిన ఈ అత్యాధునిక పరికరాల వల్ల క్యాన్సర్ రోగులకు మెరుగైన చికిత్సలు అందుబాటులోకి వస్తాయని కేజీహెచ్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ శిల్పా తెలిపారు. కార్పొరేట్ ఆస్పత్రులలో లభించే ఆధునిక చికిత్స ఇప్పుడు కేజీహెచ్‌లో కూడా అందుబాటులో ఉంటుందని ఆమె పేర్కొన్నారు. గతంలో 2001 నుంచి టెలికోబాల్ట్-60 యంత్రంతో చికిత్స అందిస్తున్నారని ఆమె గుర్తు చేశారు.

న్యూస్‌రీల్

ప్రమాద స్థాయికి చేరువలో 'రైవాడ' నీటిమట్టం

- ఏ క్షణంలోనైనా స్పిల్ వే గేట్ల ద్వారా నీరు విడుదల చేసే అవకాశం

దేవరాపల్లి: గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో రైవాడ జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరువలో ఉంది. జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 113.45 మీటర్ల వరకు వచ్చింది. ప్రమాదకరస్థాయి 113.50 మీటర్లను ఏక్షణంలోనైనా చేరుకునే అవకాశం ఉంది. దీంతో జలాశయంలోకి వచ్చే ఇన్‌ఫ్లో ఆధారంగా స్పిల్ వే గేట్ల ద్వారా శారదానదిలో నీరు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇరిగేషన్ డీఈఈ జి.సత్యంనాయుడు తెలిపారు. శారదానది పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శారదా నదిలోకి దిగే ప్రయత్నం చేయవద్దని ఆయన సూచించారు.

వరల్డ్ స్కేటింగ్ పోటీల్లో దీపికకు బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన స్కేటింగ్ క్రీడాకారిణి చైత్ర దీపిక

నర్సీపట్నం: ఆస్ట్రేలియాలోని మౌంట్ వారెన్‌లో ఆగస్టు 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 2025 వరల్డ్ స్కేట్ ఫసిఫిక్ కప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో నర్సీపట్నానికి చెందిన స్కేటింగ్ క్రీడాకారిణి పి.చైత్ర దీపిక భారత జట్టుకు పలు విభాగాల్లో ప్రాతినిధ్యం వహించింది. పెయిర్ స్కేటింగ్, ఇన్‌లైన్, కపుల్ డాన్స్ విభాగాల్లో మూడు బంగారు పతకాలు సాధించి, దేశానికి ఎంతో పేరు తీసుకువచ్చింది. అంతర్జాతీయ స్థాయిలో భారత స్కేటింగ్ ప్రతిభను చైత్ర దీపిక మరోసారి నిరూపించింది. ఈ విజయంతో 50 పతకాలు సాధించి చైత్ర దీపిక క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచింది.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం



ధర్మవరంలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేత అప్పలరాజు

ఎస్.రాయవరం: వర్షాలు అనుకూలించక అరకొరగా 30 శాతం నాట్లు వేసినా.. యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు విమర్శించారు. ధర్మవరం అగ్రహారంలో ఆదివారం ఆయన రైతులతో కలిసి వరి పంటను పరిశీలించారు. జిల్లాలో లక్షా 35 వేల ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉండగా కేవలం 50 వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయని, అయినా సరే రైతు సహాయ కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచలేక పోయారన్నారు. నాట్లు వేసిన పంటలకు యూరియా సరఫరా చేయకపోతే రైతులు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు.

15 నుంచి కార్పొరేటర్ల అధ్యయన యాత్ర

డాబాగార్డెన్స్: ఈ నెల 15 నుంచి జీవీఎంసీ కార్పొరేటర్లు అధ్యయన యాత్రకు వెళ్లనున్నారు. అధ్యయన యాత్రలో భాగంగా కార్పొరేటర్లు రాజస్థాన్‌లోని జోధ్‌పూర్, ఉదయ్‌పూర్, జైపూర్, జైసాల్మీర్ మున్సిపాలిటీలు సందర్శించనున్నారు. యాత్రలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది మొత్తంగా 130 మంది వెళ్లనున్నట్టు సమాచారం. 8 రోజుల పాటు ఆయా మున్సిపాలిటీల్లో పర్యటించి అక్కడ అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధ్యయనం చేయనున్నారు.

జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్‌గా సత్యనారాయణరాజు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ (సీఈ)గా సత్యనారాయణరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకుముందు ఇన్‌చార్జ్ సీఈగా ఉన్న పల్లంరాజు స్థానంలో సత్యనారాయణ రాజుకు పదోన్నతి కల్పించారు. ఆయన గతంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా విధులు నిర్వహించారు. అదే విధంగా జీవీఎంసీ వాటర్ సప్లై ఎస్ఈగా కేవీఎన్ రవి పదవీ విరమణ చేయడంతో, ఆ స్థానంలో ఏడుకొండలు ఇన్‌చార్జ్ ఎస్ఈగా నియమితులయ్యారు.

క్లుప్తంగా

భస్మాలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు



స్వయంభూ విఘ్నేశ్వరుడు

చోడవరం: స్థానిక శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో భస్మ అలంకరణలో కార్యసిద్ధి గణపతి భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రోజుకో అంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరస్వామి దర్శనమిస్తున్నారు. దీనిలో భాగంగా 5వ రోజు స్వామివారు భస్మ అలంకరణలో దర్శనమిచ్చారు.

నూకాంబికను దర్శించుకున్న హోం మంత్రి అనిత



అమ్మవారిని దర్శించుకుంటున్న అనిత

అనకాపల్లి: అనకాపల్లి నూకాంబిక అమ్మ వారిని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదివారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మ వారికి మొక్కు తీర్చుకున్నారు. అంతకు ముందు అనితకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్, ఆలయ ఈవో కె.ఎల్.సుధారాణి, పలువురు నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పది మంది జూదరుల అరెస్టు



పోలీసులకు పట్టుబడిన జూదరులు

కశింకోట: మండలంలోని చెరకాం, అడ్డాం గ్రామాల పరిసర ప్రాంతంలో జూదం ఆడుతున్న పది మందిని ఆదివారం పట్టుకున్నట్టు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. వారి నుంచి రూ.61,300 నగదు, నాలుగు బైకులు, 9 మొబైల్ ఫోన్లు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ పి.మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన దాడిలో హెచ్‌సీ సూర్యారావు, కానిస్టేబుళ్లు డి.గోపి, నర్సింహమూర్తి, బి.శ్రీను, రాజశేఖర్, రామిరెడ్డి పాల్గొన్నారు.

వినాయకుని ఆలయంలో చోరీ



నగదు చోరీ చేసి దొంగలు పడేసిన హుండీ

అచ్యుతాపురం రూరల్ : దిబ్బపాలెం పంచాయతీ పైలవానిపురంలో గల సిద్ధి వినాయకుని ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలో ఉన్న హుండీలో నగదు, కానుకలను ఇద్దరు దొంగలు అపహరించారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్టు సీఐ నమ్మి గణేష్ తెలిపారు.

వైభవంగా రాధాష్టమి ఉత్సవం



పల్లకీ ఉత్సవం

తగరపువలస: ఆనందపురం మండలం, గంభీరం ఐఐఎంపీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో ఆదివారం హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీరాధాష్టమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఉదయం 11 గంటలకు శ్రీరాధా మదన్ మోహన మందిరం నుంచి శ్రీరాధాకృష్ణుల విగ్రహాలను సంకీర్తనలతో పల్లకీలో ఊరేగించారు. ఈ ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, పూలతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా, శ్రీరాధా మదన్ మోహనుల విగ్రహాలకు సప్త నదులైన గంగ, యమున, సరస్వతి, గోదావరి, నర్మద, సింధు, కావేరి నదుల జలాలతో అభిషేకం నిర్వహించారు. వీటితో పాటు 108 కలశాలు, పండ్ల రసాలు, పంచామృతాలు, పంచగవ్యాలతో వేద మంత్రాల నడుమ అభిషేకాలు అంగరంగ వైభవంగా జరిగాయి. హరేకృష్ణ మూవ్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస, శ్రీరాధారాణి ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. శ్రీకృష్ణాష్టమి తర్వాత 15 రోజులకు వచ్చే భాద్రపద శుక్ల అష్టమిని రాధాష్టమి పర్వదినంగా పిలుస్తారని ఆయన తెలిపారు. రాధాదేవి సాక్షాత్తు శ్రీకృష్ణుని అంతరంగిక శక్తి స్వరూపమని, ఆమె ఆరాధనకు ఇది ఒక అపురూప సమయమని అన్నారు. ఈ వేడుకలలో పాల్గొన్న సుమారు 500 మంది భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసినట్లు హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి యదురాజ దాస వెల్లడించారు.

సందడిగా పూల అలంకరణ పోటీలు

హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం పూలదండలు, పుష్పగుచ్ఛాల అలంకరణ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 12 నుంచి 16 ఏళ్ల బాలబాలికలు, 16 ఏళ్ల పైబడిన మహిళలు కలిపి మొత్తం 112 మంది పాల్గొన్నారు. రాధాష్టమి సందర్భంగా జరిగిన ఈ పోటీలలో, అందరూ ఉత్సాహంగా వివిధ రకాల పూల అలంకరణలు చేశారు. జయంతి దేవివాసికి ప్రథమ బహుమతి(రూ.50వేలు), ద్వితీయ బహుమతి కె.జయలక్ష్మి (రూ.40వేలు), తృతీయ బహుమతి కె.సుధ (రూ.25 వేలు) కైవసం చేసుకున్నారు. వీరికి హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస అందజేశారు. ఈ పోటీలకు ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతి ఆముక్త మాల్యద న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.



మొదటి బహుమతి అందుకుంటున్న జయంతి

ఎరువుల షాపులో విజిలెన్స్ తనిఖీలు



గోదాములో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ ఎస్ఐ రవికుమార్, ఏవో సోమశేఖర్

కె.కోటపాడు : స్థానిక లలిత ఆగ్రో ఏజెన్సీలో శనివారం రాత్రి విజిలెన్స్ ఎస్ఐ రవికుమార్, మండల వ్యవసాయాధికారి ఎం.వి.సోమశేఖర్ తనిఖీలు జరిపారు. స్టాకులో తేడాలు ఉన్నట్లు గుర్తించి, సుమారు రూ.46వేల ఎరువులను సీజ్ చేసి, 6ఏ కేసు నమోదు చేశారు. 100 బస్తాల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువును రెండు రోజుల క్రితం షాపు యజమానికి తీసుకొచ్చారు. అయితే బిల్లులు ఇవ్వకుండానే 24 బస్తాలను విక్రయించడాన్ని అధికారులు గమనించారు. దీనిపై తగిన చర్యలను తీసుకోనున్నట్లు మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆరుగురి ప్రాణాలు కాపాడిన లైఫ్‌గార్డ్స్



పర్యాటకులతో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది(విశాఖ): రుషికొండ బీచ్‌లో సముద్రంలో కొట్టుకుపోతున్న పర్యాటకులను లైఫ్‌గార్డ్స్ రక్షించారు. ఆదివారం మధ్యాహ్నం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 15 మంది యువతీ యువకుల బృందం రుషికొండ బీచ్‌ను సందర్శించడానికి వచ్చింది. వీరు సముద్రంలో స్నానం చేస్తుండగా, అలల ఉధృతి కారణంగా వారిలో ఆరుగురు నమన్, చంద్రకర్, అంజు, ఖుష్బూ యాదవ్, గౌరవ్ సాహు, ఆరుషి సింఘా, రోహన్ చంద్రకర్ కొట్టుకుపోయారు. ఈ విషయాన్ని గమనించిన లైఫ్‌గార్డ్స్ ఎస్. నూకరాజు, ఎం. అమ్మోరు, చందు, సతీష్, గురుమూర్తి, చిన్నప్పన్న, వెంకటేష్, దేవ, రాజ్‌కుమార్ వెంటనే స్పందించి, వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అనంతరం మెరైన్ పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

చెస్ టోర్నీ విజేతలు సాత్విక్, ఆదిత్య



టాప్ బోర్డుపై ఆదిత్య(తెల్లపావులు)



విజేతలకు బహుమతులందిస్తున్న అతిథులు

విశాఖ స్పోర్ట్స్: ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో, ఆంధ్ర చెస్ సంఘం పర్యవేక్షణలో వాల్తేర్ క్లబ్‌లో రెండు రోజుల పాటు ఉత్కంఠభరితంగా జరిగిన ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది ర్యాపిడ్ విభాగంలో సాత్విక్ విజేతగా నిలవగా, బ్లిట్జ్ ఓపెన్ చాంపియన్‌షిప్‌ను ఫిడే మాస్టర్(ఎఫ్ఎం) ఆదిత్య వరుణ్ కైవసం చేసుకున్నారు.

ర్యాపిడ్‌లో సాత్విక్‌దే పైచేయి

తొమ్మిది రౌండ్ల పాటు హోరాహోరీగా సాగిన ర్యాపిడ్ ఓపెన్ టోర్నీలో సాత్విక్, శ్రావ్యశ్రీ, నైనాలు ఎనిమిదేసి పాయింట్లతో సమంగా నిలిచారు. అయితే మెరుగైన టై బ్రేకర్ స్కోర్ ఆధారంగా సాత్విక్‌ను విజేతగా ప్రకటించారు. కేవలం ఎనిమిదో ర్యాంక్‌తో టోర్నీని ప్రారంభించిన సాత్విక్ అద్భుతమైన ప్రదర్శనతో విజేతగా నిలిచి తన ఫిడే రేటింగ్‌ను 23 పాయింట్లు మెరుగుపరుచుకున్నాడు. శ్రావ్యశ్రీ 11వ ర్యాంక్ నుంచి రెండో స్థానానికి, నైనా 15వ ర్యాంక్ నుంచి మూడో స్థానానికి ఎగబాకి సత్తా చాటారు. చివరి రౌండ్‌లో నైనాపై శ్రావ్యశ్రీ విజయం సాధించడం గమనార్హం. టోర్నీ టాప్ సీడ్, ఫిడే మాస్టర్ (ఎఫ్ఎం) ఆదిత్య 7.5 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఎరీనా ఇంటర్నేషనల్ మాస్టర్ (ఏఐఎం) రవికుమార్, షణ్ముఖ, శ్రీరామ్, శ్రీ అఖిల్ కూడా 7.5 పాయింట్లతో టాప్-8లో నిలిచారు. ఈ టోర్నీలో మొత్తం 332 మంది క్రీడాకారులు పాల్గొనగా, వారిలో 131 మంది ఫిడే రేటెడ్ ఆటగాళ్లు ఉన్నారు.

బ్లిట్జ్‌లో ఆదిత్య వరుణ్ హవా

బ్లిట్జ్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో ఫిడే మాస్టర్ (ఎఫ్ఎం) ఆదిత్య వరుణ్ విజేతగా నిలిచాడు. ఆదిత్య, ఎరీనా ఫిడే మాస్టర్ (ఏఎఫ్ఎం) ఆర్నవ్, సాత్విక్, రామ్‌చరణ్‌లు ఎనిమిదేసి పాయింట్లు సాధించినప్పటికీ, మెరుగైన టై బ్రేకర్స్ ఆదిత్యను విజేతగా నిలబెట్టాయి. కాండిడేట్ మాస్టర్ (సీఎం) రుత్విక్, అఖిల్, శ్రీరామ్‌లు 7.5 పాయింట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. మూడు నిమిషాల టైమ్ కంట్రోల్‌తో నిర్వహించిన ఈ బ్లిట్జ్ టోర్నీలో 285 మంది పాల్గొన్నారు. ర్యాపిడ్ చెస్ టోర్నీలో అండర్-7 కేటగిరీలో షణ్విక్ (బాలురు), సాయిశ్రీ (బాలికలు), అండర్-9లో శ్రీసాయి (బాలురు), శ్రీనిఖిల (బాలికలు), అండర్-11లో పర్వేష్ (బాలురు), అనన్య (బాలికలు), అండర్-13లో హర్షవర్ధన్ (బాలురు), త్రిపురాంబిక (బాలికలు), అండర్-15లో వెంకటేశ్వరరావు (బాలురు), లక్ష్మీ ప్రియ (బాలికలు), అన్‌రేటెడ్‌లో కుమార్, బెస్ట్ వుమెన్‌గా సుప్రీత, బెస్ట్ విశాఖ ప్లేయర్‌గా రమణబాబు, పీహెచ్‌సీ కేటగిరీలో జిగ్నేష్ విజేతలుగా నిలిచారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు సురేష్, ఆంధ్ర చెస్ సంఘం సలహాదారు కేవీవీ శర్మ, టోర్నీ డైరెక్టర్ మణికంఠ, చీఫ్ ఆర్బిటర్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ దందా



చినబొడ్డేపల్లిలో పొక్లెయిన్‌తో జరుపుతున్న గ్రావెల్ తవ్వకాలు



ట్రాక్టరులో తరలిపోతున్న గ్రావెల్

కోటవురట్ల: హోం మంత్రి అనిత సొంత నియోజకవర్గంలో అక్రమాలకు అంతులేకుండా పోతోంది. ఇసుక, గ్రావెల్ దందా యథేచ్ఛగా సాగుతోంది. పాలకులు, అధికారుల అండదండలతో అక్రమార్కులు లెక్కలేనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఏడాదిగా అక్రమాలకు పాల్పడుతూ ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. రూ.కోట్లలో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతున్నా చోద్యం చూస్తున్నారు. మండలంలో చినబొడ్డేపల్లిలో గ్రావెల్ దందా భారీ స్థాయిలో జరుగుతోంది. ఇందుకు పెద్దల అండదండలు మెండుగా ఉన్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. గ్రావెల్ దందా చేస్తున్న వ్యక్తే స్వయంగా నాకు పై నుంచి సపోర్టు ఉంది, ఎవరూ ఏం చేయలేరు అంటూ చెప్పుకోవడం కొసమెరుపు. చినబొడ్డేపల్లి రెవెన్యూ పరిధిలో నాలుగు కొండలపై గ్రావెల్ తవ్వకాలు కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నిరాటంకంగా జరుగుతున్నాయి. రాత్రీ పగలూ తేడా లేకుండా సదరు టీడీపీ నేత పొక్లెయిన్‌తో కొండలను తవ్వేస్తున్నాడు. ఇప్పటికే కొండలు సగం వరకు తరిగిపోగా సదరు టీడీపీ నేత రూ.కోటికి పైగా వెనకేసుకున్నట్టు బోగట్టా. రెడ్డి కొత్తూరుకు చెందిన ఆ టీడీపీ నేత తన సొంత పొక్లెయిన్‌తో తవ్వకాలు జరిపి ట్రాక్టర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నాడు. ప్రతీ రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో గ్రావెల్ తరలించి అక్రమార్జనకు పాల్పడుతున్నాడు. ఇంత దోపిడీ జరుగుతున్నా పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ శాఖాధికారుల పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఫిర్యాదులు వచ్చినప్పుడు, పత్రికల్లో కథనాలు వెలువడినపుడు తూతూ మంత్రంగా దాడులు చేసి, అక్కడ ఎవరూ లేరంటూ చేతులు దులిపేసుకుంటున్నారు. జరిగిన దోపిడీ కంటి ముందు కనిపిస్తున్నా ఎటువంటి విచారణ చేయకుండా చోద్యం చూడడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పై స్థాయి నుంచి ఒత్తిళ్లు ఉండడంతోనే అక్రమాలపై చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అధికారుల తీరుపై పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జరిగిన దోపిడీపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హక్కులు సాధించేందుకు పోరాటాలకు సిద్ధం

మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్



మాట్లాడుతున్న గిరిబాబు

బీచ్‌రోడ్డు: వైద్య ఉద్యోగుల హక్కుల సాధనకు పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గిరిబాబు అన్నారు. ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశం పెద్ద వాల్తేరులోని టీబీ ఆస్పత్రిలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఉద్యోగులకు 36శాతం తాత్కాలిక భృతి ప్రకటించి, 12వ వేతన కమిటీ చైర్మన్‌ను నియమించి పెండింగ్ డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి 12వ పీఆర్‌సీ, 36శాతం ఐఆర్ చెల్లించాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయి సత్యనారాయణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సంపాదిత లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పెండింగ్ డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌లో డైటీషియన్లకు పదోన్నతులు కల్పించాలని, వైద్య విద్యా సంచాలకుల విభాగంలో ఇన్‌సర్వీస్‌లో శిక్షణ పూర్తి చేసిన ల్యాబ్ అటెండెంట్, ల్యాబ్ టెక్నీషియన్లకు పదోన్నతులు కల్పించాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు 100శాతం బేసిక్, డీఏ, హెచ్‌ఆర్ఏ చెల్లించాలని, 126 జీవోను సవరణ చేసి ఈఎస్ఐ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పడాల రమణ చేతుల మీదుగా మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఏఐటీయూసీ వజ్రోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు సారిపిల్లి గంగరాజు, కొల్రాయి రమేశ్, ఎస్కె ఇబ్రహీం, ధనుంజయ్, శివశంకర్, రమాశంకర్, మహమ్మద్ దురానీ, ఎంఎస్ రఘునాథరావు, రఘు, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవంలో విషాదం

- దూసుకెళ్లిన స్కార్పియో
- ఇద్దరు మృతి, మరో ఆరుగురికి తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం
- కేజీహెచ్‌కు తరలింపు
- నిమజ్జనం సందడిలో అపశ్రుతి
- మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని చింతలవీధి గిరిజనుల ఆందోళన



ప్రమాద స్థలంలో బీభత్స దృశ్యం.. చెల్లాచెదురైన మృతదేహాలు





తీవ్రంగా గాయపడిన గిరిజన మహిళలు



ఆస్పత్రిలో బాధితులను ఓదారుస్తున్న ఎంపీ తనూజరాణి, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



ప్రాణాలు కోల్పోయిన సీతారామ్, కొండబాబు



వాహనం పైకెక్కి ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు





రోదిస్తున్న మృతులు సీతారామ్ భార్య పద్మ, కొండబాబు భార్య దేవి, కుటుంబ సభ్యులు

సాక్షి,పాడేరు: చవితి ఉత్సవాల్లో భాగంగా గణపతి విగ్రహ నిమజ్జన ఊరేగింపులోకి స్కార్పియో వాహనం దూసుకెళ్లడంతో ఇద్దరు గిరిజనులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో పాడేరుకు రెండు కిలోమీటర్ల దూరంలోని చింతలవీధి జంక్షన్‌లోని జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చింతలవీధికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి కొర్రా సీతారామ్(65), గుంట కొండబాబు(35) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. మహిళలు వంతాల మొత్తి, గుంట దొస్సు, కొర్రా గౌరమ్మ, వంతాల దాలిమా, పాంగి మొత్తి, కొర్రా ఈశ్వరి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని పోలీసులు, స్థానికులు హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు కల్పించారు. తీవ్రంగా గాయపడిన గిరిజనులను కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాద సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన చింతలవీధి గిరిజనులు, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని చింతలవీధి జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పాడేరు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ ప్రమాద సంఘటనపై పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, చింతలవీధి సర్పంచ్ వంతాల సీతమ్మ విచారం వ్యక్తం చేశారు.

జిల్లా ఆస్పత్రికి అరకు ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

ప్రమాదవార్త తెలుసుకున్న అరకు ఎంపీ తనూజరాణి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు.మృతుల కుటుంబాలతోపాటు గాయపడిన గిరిజనులను వారు పరామర్శించారు. గాయాలపాలైన గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ తమర్బ నరసింగరావులకు సూచించారు. గిరిజనుల ఆందోళనతో చింతలవీధి జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. మృతుల బంధువులంతా రోడ్డుపై బైటాయించారు. ప్రమాద వాహనాన్ని తగలబెడతామంటూ ఆందోళన చేశారు



GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14303]

■ ప్రముఖ MNC కంపెనీకి యువతి / యువకులు కావలెను. జీతం: 15,000/- ఆకర్షణీయమైన జీతం. అర్హత: 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ITI సంప్రదించండి. 8792811822, 9901042458 [G-733]

సాక్షి క్లాసిఫైడ్స్

లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/- అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు

ప్రాంతీయ నేత్ర వైద్య శాఖ సూపరింటెండెంట్ మీనాక్షి

ఏయూక్యాంపస్: దేశంలో అనేక మంది ప్రజలు నేత్ర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ఒకరు దానం చేసే నేత్రాలు మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపుతాయని ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి పేర్కొన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు కంటి దానం పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, మోహసీన్ ఐ బ్యాంక్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఒక వ్యక్తి మరణించిన తర్వాత 6 నుంచి 8 గంటల వ్యవధిలో నేత్రాలను దానం చేయవచ్చని తెలిపారు. నేత్రదానంపై అవగాహన కల్పిస్తూ విభిన్న కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. గాయత్రి మెడికల్ కళాశాల వైద్యురాలు డాక్టర్ జ్యోతిర్మయి, ఎన్ఆర్ఐ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ధర్మరాజులు నేత్రదానం ఆవశ్యకతను వివరించారు. బీచ్‌రోడ్డులో కరపత్రాలను పంపిణీచేసి, అవగాహనకల్పించారు.

ఏపీహెచ్ఎంఏ వైస్ ప్రెసిడెంట్‌గా పాకలపాడు హెచ్ఎం

నర్సీపట్నం: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ అసోసియేషన్ (ఏపీహెచ్ఎంఏ) రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నికలు విజయవాడలో జరిగాయి. ఈ ఎన్నికల్లో గొలుగొండ మండలం పాకలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.ఎస్.ప్రసాద్ రాష్ట్ర జోన్-1 వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఆయనకు జిల్లా లోని పలువురు ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఎంఈవోలు అభినందనలు తెలిపారు.

ప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న సహచర హెచ్ఎంలు →



విహారయాత్రకు వచ్చి అనంతలోకాలకు..

- లారీని ఢీకొని యువకుడి మృతి
- మృతుడు తూర్పుగోదావరి జిల్లా వాసి

రంపచోడవరం: మారేడుమిల్లి మండలం సున్నంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఒక యువకుడు మృతి చెందాడు. తూర్పు గోదావరి జిల్లా బొబ్బిల్లంక గ్రామానికి చెందిన మర్రిరెడ్డి ఫణీంద్ర(37)గా గుర్తించారు. విహార యాత్ర నిమిత్తం మారేడుమిల్లి బైక్‌పై వచ్చి తిరిగి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టడంతో ఫణీంద్ర సంఘటన స్థలంలోనే మరణించాడు. అతని బైక్‌పై ఉన్న మరొక యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

అన్నం పరబ్రహ్మ స్వరూపం



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ

అనకాపల్లి టౌన్: వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గవరపాలెం పాత జగన్నాథ్ థియేటర్ ప్రాంగంలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. ఈ కార్యక్రమాన్ని గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపం.. అన్నాన్ని ప్రసాదంగా భావించి స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో నూకాంబిక కేటరింగ్ సభ్యులు దాడి ఈశ్వరరావు, ఆడారి స్వామి, దాడి ఆదినారాయణ బొడ్డేడ స్వామి తదితరులు పాల్గొన్నారు.

విజయదశమి ఉత్సవాలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్: మండలంలోని సత్యనారాయణపురం కనకదుర్గ కొండపై విజయదశమి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బోయిన రమణాజీ తెలిపారు. అక్టోబర్ 2న విజయదశమి సందర్భంగా నిర్వహించబోయే నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లపై కమిటీ సభ్యులు విస్తృతంగా చర్చించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, ముందస్తు ఏర్పాట్లపై పలువురి సభ్యుల నుంచి సూచనలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు, ధర్మకర్త మేడిశెట్టి సత్తిబాబు, దొడ్డు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

18న దుర్గమాంబ ఉత్సవం



మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ మళ్ల బుల్లిబాబు

కశింకోట: స్థానిక గవరపేటలో ప్రసిద్ధి చెందిన దుర్గమాంబ ఉత్సవాన్ని ఈ నెల 18న నిర్వహించాలని నిర్ణయించినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల బుల్లిబాబు తెలిపారు. స్థానిక అమ్మవారి ఆలయంలో ఆదివారం ఉత్సవ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి పండుగ చాటింపు 4న, అమ్మవారి పుట్టుక మహోత్సవం 11న నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ



బయపురెడ్డిపాలెం బ్రిడ్జి వద్ద స్తంభించిన ట్రాఫిక్

నర్సీపట్నం: నర్సీపట్నం నుంచి తుని వెళ్లే మార్గంలో బయపురెడ్డిపాలెం వంతెనపై కారు, బైక్ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదం కారణంగా నర్సీపట్నం నుంచి తుని వెళ్లే వాహనాలు, తుని నుంచి నర్సీపట్నం వచ్చే వాహనాలు వంతెనపై నిలిచిపోయాయి. ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు సుమారు 40 నిమిషాలు సమయం పట్టింది.

30 మంది యువకుల రక్తదానం

మాకవరపాలెం: మండలంలోని బూరుగుపాలెంలో 30 యువకులు రక్తదానం చేశారు. సర్పంచ్ వొబ్బలరెడ్డి రమణ జన్మదినం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు ప్రారంభించారు. మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, మాజీ అధ్యక్షుడు వాసు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	:త్రిబాణధారి బార్బరిక్
సత్యనారాయణ స్క్రీన్-1	:కొత్తలోక
సత్యనారాయణ స్క్రీన్-2	:బ్రహ్మాండ
పర్తిసాయి	:మహావతార్‌నరసింహం (మ్యాట్నీ, సెకండ్ షో)
పర్తిసాయి	:అర్జున్ చక్రవర్తి (మార్నింగ్ షో, ఫస్ట్ షో)
షిర్డీసాయి	:కూలీ
వెంకటేశ్వర	:బన్ బట్టర్ జామ్
శ్రీ సత్య	:హరిహర వీరమల్లు
రామచంద్ర	:వార్ 2

ఎన్నికల హామీ మరిచారా..!

- 6 నెలల్లోనే అభివృద్ధి చేస్తామని వాగ్దానం
- ఏడాదిన్నర దాటినా పట్టించుకోని కూటమి పాలకులు
- అధ్వానంగా జమాదులపాలెం రోడ్డు
- వాహనదారులకు ఇక్కట్లు



గతుకులమయంగా రోడ్డు

కశింకోట: అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే జమాదులపాలెం రోడ్డును అభివృద్ధి చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు ఇప్పుడు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికి ఏడాదిన్నర దాటినా ఈ రోడ్డు వైపు కన్నెత్తి చూడలేదు. దాంతో రోడ్డు గోతుల్లో నీరు చేరి గ్రామస్తులతోపాటు ఇతర గ్రామాల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రానికి మారుమూలన ఉన్న జమాదులపాలెం గ్రామం జాతీయ రహదారి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. 2 వేలపైగా జనాభా కలిగి ఉంది. ఈ గ్రామంతోపాటు బుచ్చెయ్యపేట మండలం మల్లాం, రాజాం తదితర గ్రామాలకు ఇదే మార్గం ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ గ్రామానికి సిమెంట్, తారు రోడ్డు చాలా కాలం క్రితం భారీ వాహనాల దాటికి దెబ్బతింది. ఎక్కడికక్కడే గోతులు పడ్డాయి. దీంతో రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షం పడిందంటే ఈ రోడ్డులో నీరు నిల్వ ఉండి గోతులు కానక వాటిలో పడి వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అత్యవసర సమయంలో రోగులను ఆస్పత్రికి తీసుకెళ్లడానికి ఇబ్బంది పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు.

ఏడాదిన్నరగా పట్టించుకోని కూటమి పాలకులు

గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.59 లక్షలతో రోడ్డు నిర్మించడానికి ప్రయత్నాలు చేశారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. అయితే కూటమి నాయకులు రోడ్డు నిర్మాణానికి ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోగా పనులు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాదిన్నర అవుతున్నా రోడ్డు నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. దీంతో తమ ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. తక్షణమే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ రహదారిని పునర్నిర్మించి తమ ఇబ్బందులు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



దారుణంగా తయారైన జమాదులపాలెం రోడ్డు

గోతులతో ఇబ్బంది పడుతున్నాం



జమాదులపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. గోతులతో నిండి ఉండటం వల్ల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. ఏ మాత్రం వర్షం వచ్చినా గోతుల్లో నీరు నిల్వ ఉండిపోయి గతుకుల కానక వాటిలో పడి వాహనాల దెబ్బతింటున్నాయి. ఇప్పటికైనా రోడ్డును పునర్నిర్మించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

-కె. రాజు, జమాదులపాలెం

కూటమి హామీ నెరవేర్చాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా జమాదులపాలెం రోడ్డు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోగా రోడ్డు పునర్నిర్మిస్తామని గత సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అది ఇప్పటికీ అమలు కాలేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.59 లక్షలతో రోడ్డు నిర్మాణానికి ప్రయత్నాలు చేశాం. ఈలోగా ఎన్నికలు రావడంతో పనులు జరగలేదు. ఇప్పటికైనా కూటమి నాయకుల హామీ మేరకు సత్వరమే రోడ్డు పునర్నిర్మాణం చేపట్టాలి.

-కరక సోమునాయుడు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు, జమాదులపాలెం

సమస్యల పరిష్కారానికి కృషి

అనకాపల్లి టౌన్: దళితులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అనకాపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ సిద్దేశ్వరరావు తెలిపారు. మండలంలోని సీతానగరం ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరహక్కులను తెలియజేసి, వారి సమస్యలు సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మోనిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'అమరత్వం' కవితకు పురస్కారం



కొరాడ అప్పలరాజును సత్కరిస్తున్న సాహితీ మిత్రులు

అనకాపల్లి టౌన్: రాష్ట్ర స్థాయి కవితల పోటీల్లో మండలంలోని కూడ్రం హైస్కూల్ తెలుగు మాస్టార్ కొరాడ అప్పలరాజు రాసిన కవితకు ఉత్తమ పురస్కారం లభించింది. మదిలిపట్నం సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో దేశభక్తి అంశంపై అమరత్వం శీర్షికతో రాసిన కవిత ఎంపికైంది. ఈ పోటీల్లో 300 మంది పాల్గొని తమ కవితలను ఆలపించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అప్పలరాజును ఘనంగా సత్కరించి, ఉత్తమ బహుమతి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సాహితీ మిత్రులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంలో క్లిష్టమైన రోగాలు నయం

అనకాపల్లి ఆయుష్మాన్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి కొండా లావణ్య

కశింకోట: ఆయుర్వేదం భారత దేశీయ వైద్యమని, చాలా ఏళ్లుగా అనేక క్లిష్టమైన రోగాలను సైతం నయం చేసిన ఘన చరిత్ర ఉందని అనకాపల్లి ఆయుష్మాన్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి కొండా లావణ్య తెలిపారు. కశింకోటలోని అగ్రహారంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 'వైద్యో నారాయణో హరి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేదంలో అనేక వ్యాధులకు ఆపరేషన్ అవసరం లేకుండా నయం చేయడం జరుగుతుందన్నారు. సీజనల్ వ్యాధులతోపాటు దీర్ఘకాలిక వ్యాధులను ఆయుర్వేదంలో నయమవుతాయన్నారు. సైడ్ ఎఫెక్ట్స్ లేని ఆయుర్వేద వైద్యాన్ని ఆచరించి ఆరోగ్యవంతంగా ఉండాలని ప్రజలను కోరారు. ప్రతి ఒక్కరూ యోగా, ధ్యానం ఆచరించాలన్నారు. వీటితో ఆరోగ్యం సమకూరుతుందన్నారు. అనంతరం పేరి పృథ్వీచరణ్‌శర్మ, తాతపూడి సీతారామాంజనేయ శాస్త్రిల ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు ప్రదర్శించి ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యురాలు లావణ్యను దుశ్శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. విశ్రాంత హెచ్ఎం వేదుల వెంకట శాస్త్రి, ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు అవసరాల సీతా కామేశ్వరి, కార్యదర్శి మొక్కరాల కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లి ఆయుష్మాన్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి లావణ్యకి సన్మాన దృశ్యం



సూర్య నమస్కారాల గురించి వివరిస్తున్న పేరి పృథ్వీచరణ్ శర్మ

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి

ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి

అనకాపల్లి టౌన్: ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె. ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక దొడ్డి రామానాయుడు భవనంలో జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో ఆశా కార్యకర్తలు పని చేస్తున్నారని వాపోయారు. గ్రామాల్లోనే ఆశా కార్యకర్తలు విధులు నిర్వహించాల్సి ఉండగా, సబ్ సెంటర్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేయాలని అధికారులు ఒత్తిడి చేయడం తగదన్నారు. పెరుగుతున్న ధరలతో నేడు ఇస్తున్న వేతనం ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకర్రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను రద్దు చేస్తున్నాయని, ఎన్నికలకు మందు కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని, దీనిని వెంటనే అమలు చేయాలన్నారు. బి. సత్యవతి, బి. రామలక్ష్మి, ఎం. సూర్యకళ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి

7న జిల్లా సేవాదళ్ ట్రైనింగ్ క్యాంప్

దేవరాపల్లి: అనకాపల్లిలో సెప్టెంబర్ 7న నిర్వహించే జిల్లా సేవాదళ్ శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలని సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు కోరారు. మండలంలోని పెదనందిపల్లిలో సత్యసాయి సేవా సంస్థల జోనల్ సమావేశం జోనల్ ఇన్‌చార్జి రవిశంకర్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ వెయ్యి మంది సేవాదళ్ సభ్యులతో ట్రైనింగ్ నిర్వహించడం లక్ష్యమన్నారు. అనకాపల్లిలోని శ్రీకన్యకాపరమేశ్వరీ దేవస్థాన సంఘానికి చెందిన గుంపిన సర్వేశ్వరరావు, అనుమాలిశెట్టి వెంకటరాజు కల్యాణ మండపంలో జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో బాలవికాస్ శంకర్, శ్రీరామమూర్తి, కన్నబాబు, నాలుగు మండలాల భజన మండలి కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



ఆత్మీయ కలయికకు హాజరైన 2004-05 బ్యాచ్ విద్యార్థులు

కె.కోటపాడు : గొండుపాలెం జెడ్పీ హైస్కూలులో చదువుకున్న 2004-05 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన 25 మంది పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలతో సరదాగా గడిపారు. పూర్వపు విద్యార్థులు వి.గోవింద, దేముడుబాబు, అప్పారావు, సతీష్‌నాయుడు,తాతారావు, రాజశేఖర్, సత్యవేణి, భారతి, ఎర్రయ్యమ్మ, చెల్లయ్యమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

విశేషంగా ఆకట్టుకుంటున్న గణనాథులు



వేల్పువీధి టౌన్ గర్ల్స్ హైస్కూల్ పక్కన్న ఏర్పాటు చేసిన శబరిమల అయ్యప్ప స్వామి రూపంలో వినాయకుడు



న్యూకాలనీలో ఏర్పాటు చేసిన 9 అడుగుల వినాయకుడు



రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారిలో కొలువైన వినాయకుడే శివతాండవం విగ్రహం

పట్టణంలో ప్రతి వీధిలోనూ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. యూత్ అసోసియేషన్లు ఎన్నో వ్యయప్రయాసలు కోర్చి వివిధ రూపాలలో గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేశారు. వేల్పులవీధి, గవరపాలెం, చింతావారి వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్, నర్సింగరావుపేట, విజయరామరాజు పేట, లక్ష్మీదేవిపేట, మళ్లవీధి, కోట్నివీధి తదితర ప్రాంతాలలో వినూత్నంగా ఏర్పాటు చేసిన గణనాథులు నిత్య పూజలందుకుంటున్నాయి. ఉదయం, రాత్రిళ్లు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు పంచి పెడుతున్నారు. కొన్ని ప్రదేశాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా భారీ అన్న సమారాధనలు నిర్వహిస్తున్నారు.

అనకాపల్లి టౌన్



నెయ్యిలవీధిలో కొలువైన కమలంలో వినాయకుడు



రాఘవేంద్ర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వెంకటేశ్వరుడు, సిద్ధిబుద్ధి వినాయకుడు

వాడవాడలా అన్నసమారాధనలు



వైఎస్సార్ కాలనీలో వినాయకున్ని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు



తాళ్లపాలెంలోని పాల కేంద్రం వద్ద వినాయకుడు

కశింకోట: గణేష్ నవరాత్రోత్సవాల్లో భాగంగా వాడవాడలా అన్నసమారాధనలు నిర్వహించారు. ఆదివారం కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన వేణుగోపాలస్వామి ఆలయం వద్ద నెలకొల్పిన వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి ఈ కార్యక్రమాలను నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర నాయకుడు దాడి రత్నాకర్ దర్శించుకున్నారు. యువ యూత్ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు. వైఎస్సార్ కాలనీలో నెలకొల్పిన వినాయకుని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు దర్శించారు. అక్కడ అన్నసమారాధన నిర్వహించారు. వరసిద్ధి వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో గవరపేటలోని కాశీభట్ల వారి వీధిలో నెలకొల్పిన వినాయకుని మండపం వద్ద భారీ అన్న సమారాధన చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు బుద్ద వరహాబాబు, పెంటకోట జగదీశ్వరరావు పాల్గొన్నారు. గోవిందరావు కాలనీ, కనక మహాలక్ష్మి వీధిలోని వినాయకుని ఉత్సవాల్లో భారీ అన్న సమారాధనలు జరిపారు. ఇక్కడ సాయినగర్ కాలనీలో నెలకొల్పిన వినాయకునికి ప్రత్యేకంగా ముగ్గు వేసి కలశం పెట్టి పూజలు చేశారు. లడ్డూ వేలం పాట నిర్వహించారు. మహిళలు భక్తి పాటలు ఆలపించారు. భారీ అన్న సమారాధన జరిగింది. కశింకోట మండలం పాల కేంద్రం వద్ద నెలకొల్పిన మహారాజ వినాయకుడు విశేషంగా ఆకట్టుకుంటోంది.



కశింకోట వేణుగోపాలస్వామి ఆలయంలో వినాయకుని దర్శించుకుంటున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు



కశింకోట వద్ద సాయినగర్ వినాయకునికి మహిళల పూజలు



వేణుగోపాలస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న భారీ అన్న సమారాధన

